సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 20 । జనవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,200
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	30	18
తిరుపతి	31	19
తిరుమల	26	14
గూడూరు	31	20
నగరి	31	19



శాస్త్రోక్తంగా దక్షిణామూర్తి హోమం

తిరుపతి కల్చరల్: టీటీడీ అనుబంధంలోని శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీదక్షిణామూర్తి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గణనాథుని ఆదాయం రూ.1.05కోట్లు



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.1.05 కోట్లు ఆదాయంగా వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం ఉదయం ఆలయంలో 15 రోజుల హుండీ కానుకలను లెక్కించారు. బంగారం 25 గ్రాములు, వెండి 400 గ్రాములు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ డాలర్లు 2,249, యూఏఈ ధీరమ్స్ 110, ఆస్ట్రేలియా డాలర్లు 150, కెనడా డాలర్లు 70,. 10 యూరోలతో కలిపి రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చినట్లు చైర్మన్, ఈఓ వివరించారు.

దేవేంద్రరావుకు కళానిధి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దేవేంద్రరావు

చిత్తూరు రూరల్: భారతీయ తెలుగు రచయిత సమాఖ్య వ్యవస్థాపకుడు మర్రిపూడి దేవేంద్ర రావుకు శ్రీవేంకట పద్మావతి చారిటబుల్ ట్రస్టు కళానిధి పురస్కారాన్ని అందజేసింది. బుధవారం రాత్రి తిరుపతిలో ఆ ట్రస్టు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. దేవేంద్ర రావుకు కళానిధి పురస్కారం అందజేసి ట్రస్టు సత్కరించింది.

కానిస్టేబుల్ ప్రశ్న పత్రాల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ పరిశీలనలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ప్రశ్నపత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి పరిశీలించారు. కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఈనెల 22వ తేదీన ప్రిలిమినరీ పరీక్షలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో భద్రపరచనున్నారు. ఈక్రమంలో అడిషనల్ ఎస్పీ జగదీష్ ఇతర అధికారులతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ వెంట ఏఆర్ ఏఎస్ పీజీ.నాగేశ్వర రావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, వన్‌టౌన్ సీఐ నరసింహరాజు, ఎస్‌ఐ రమేష్ బాబు, పీవీకేఎన్ ప్రిన్సిపల్ జి.ఆనంద రెడ్డి, ఐటీ కోర్ టీమ్ సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి కోవిడ్ బిల్లులు జమ

చిత్తూరు రూరల్: కోవిడ్ సమయంలో వివిధ ఆస్పత్రుల్లో పనిచేసిన వారికి వేతనాలు, ఇతరత్ర బిల్లులు శనివారం నుంచి జమకానున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48 కోవిడ్ సెంటర్లలో వందలాది మంది డాక్టర్లు, వైద్య సిబ్బంది బాధ్యతతో పనిచేశారు. అలాగే కోవిడ్ కేంద్రాల నిర్వహణ బిల్లులు సుమారు రూ.15 కోట్ల వరకు జమకానున్నాయి. శనివారం నుంచి బిల్లులు, వేతనాలు నేరుగా ఆయా ఖాతాలకు జమకానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

జెట్ స్పీడ్‌గా ఎక్స్‌ప్రెస్ హైవే



హైవే డిజైన్ ఇలా..

- 2024 మార్చిలోగా చెన్నై-బెంగళూరు హైవే పూర్తి
- తొలిదశలో కర్ణాటక రాష్ట్రంలో 37శాతం పూర్తి
- రెండో దశలో ఏపీలో పదిశాతం పూర్తయిన పనులు
- చిత్తూరు జిల్లాలో జోరందుకున్న మట్టి రోడ్డు నిర్మాణం
- పూర్తయితే ప్రయాణ సమయం 2 గంటల 15నిమిషాలు మాత్రమే

పలమనేరు నియోజకవర్గంలో చెన్నై- బెంగళూరు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. అలైన్‌మెంట్ మేరకు మట్టి రోడ్డు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. హైవే మూడు ఫేజ్‌లలో నిర్మాణం సాగుతుండగా.. ఇప్పటికే కర్ణాటకలో 37శాతం పనులు పూర్తయ్యాయి. రెండో ఫేజ్‌లో పలమనేరు నియోజకవర్గంలోనూ పదిశాతం పనులు జరిగాయి. ఈనెల 10న కర్ణాటక రాష్ట్రంలోని హొసకోట సమీపంలో వడగనహళ్లి వద్ద పనులను పరిశీలించిన కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్‌గడ్కరి 2024 మార్చికల్లా పూర్తిచేసి ప్రారంభించనున్నట్టు వెల్లడించిన విషయం తెలిసిందే.

పలమనేరు : చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు స్పీడందుకున్నాయి. చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ నుంచి బెంగళూరు సరిహద్దులోని హొసకోట వరకు 283.5 కిలోమీటర్ల మేరకు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవేను ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) భారత్‌మాల పరియోజన పథకం కింద రూ.16,730 కోట్లతో 2021 నుంచి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మూడు ఫేజుల్లో పనులు సాగుతున్నాయి. తొలిఫేజ్‌లో కర్ణాటక పరిధిలోని 71 కిలోమీటర్లలో ఇప్పటికే 37.56 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు, మూడు ఫేజ్‌లలో మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాతో పాటు తమిళనాడు రాష్ట్రంలో 112 కిలోమీటర్లలో పదిశాతం మట్టిరోడ్డు పనులు, అలైన్‌మెంట్ ల్యాండ్ లెవలింగ్ సాగుతోంది. పనులు త్వరితగతిన జరిగేలా మూడు ఫేజ్‌లలో పది ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో కర్ణాటకలో మూడు, ఏపీలో మూడు, తమిళనాడులో నాలుగు ప్యాకేజీలు ఉన్నాయి. ఇందులో భాగంగా కర్ణాటక రాష్ట్ర సరిహద్దు నుంచి పలమనేరు నియోజకవర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల మీదుగా 60 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు సాగుతున్నాయి. వీటిని బేతమంగళ నుంచి బైరెడ్డిపల్లె వరకు మోంటికార్లె లిమిటెడ్ కంపెనీ, బైరెడ్డిపల్లె నుంచి బంగారుపాళెం వరకు ఆప్కో ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ, బంగారుపాళెం నుంచి గుడిపాల దాకా దిలీప్‌బిల్డ్‌కాన్ కంపెనీ పనులు చేపడుతున్నాయి. పలమనేరు మండలంలోని బేలుపల్లి క్రాస్, పట్టణ సమీపంలోని గంటావూరు వద్ద పనుల సామగ్రి కోసం యంత్రాలను నిర్మాణ కంపెనీ ఏర్పాటు చేసుకుంది.



పలమనేరు మండలం గజ్జలవారిపల్లె- జల్లిపేటల వద్ద మట్టి రోడ్డు పనులు




మట్టిరోడ్డును చదును చేస్తున్న భారీ వాహనాలు

దక్షిణాదిలోనే తొలి ఎక్స్‌ప్రెస్ హైవే

దక్షిణ భారతదేశంలోనే చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌హైవే మొట్టమొదటి కానుంది. దీనికి ఎన్‌హెచ్‌ఏఐ ఎన్‌ఈ 7గా నామకరణం చేశారు. ముఖ్యంగా మూడు రాష్ట్రాల్లో ఆర్థికాభివృద్ధి పెంపొందించడమే ఈ రహదారి నిర్మాణ ఉద్దేశం. బెంగళూరు నుంచి చెన్నై పోర్టుకు రవాణా సౌకర్యాలు పెరిగేందుకు ఈ రోడ్డు ఉపకరిస్తుంది. బెంగళూరు నుంచి చెన్నైకి విమానంలో ప్రయాణించేవారు సైతం తక్కువ. ఈ హైవే పూర్తయితే దాదాపు అంతే సమయానికి విమాన చార్జీలకంటే తక్కువ ధరతో రోడ్డు మార్గంలోనే ప్రయాణించే సౌకర్యం కలుగుతుంది

ఎక్స్‌ప్రెస్‌హైవే వివరాలిలా...

- చెన్నై నుంచి బెంగళూరు వరకు రోడ్డు దూరం 283.5 కిలోమీటర్లు
- ఇది కర్ణాటకలో 77 కి.మీ, ఏపీలో 91 కి.మీ, తమిళనాడులో 93 కిలోమీటర్లు
- ఇప్పటి వరకు బెంగళూరు-చెన్నై ప్రయాణ సమయం 6 గంటలు
- ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే 2 గంటల 15 నిమిషాలు మాత్రమే
- ఈ రహదారిలో సాధారణ వేగం గంటకు 120 కిమీ
- ఎక్స్‌ప్రెస్‌హైవేలో మొత్తం బ్రిడ్జిలు -162
- రైల్వే క్రాసింగ్‌లు-4, కల్వర్టులు-143
- మొత్తం ఫ్లైఓవర్‌లు- 17 ఉంటాయి



చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌హైవే మ్యాప్

మూడు రాష్ట్రాల్లో రోడ్డు కనెక్ట్ కానున్న పట్టణాలివే...

హోస్కోట (బెంగళూరు రూరల్ జిల్లా)	కేజీఎఫ్ (కోలార్‌జిల్లా)	పలమనేరు (చిత్తూరు జిల్లా)	రాణిపేట, వాలాజాపేట్, అరక్కోణం (తమిళనాడు)
మాలూరు (కోలారు జిల్లా)	వీ.కోట (చిత్తూరు జిల్లా)	బంగారుపాళెం (చిత్తూరు జిల్లా)	
బంగారుపేట (కోలారు జిల్లా)	హైవేజంక్షన్-బైరెడ్డిపల్లె (చిత్తూరు జిల్లా)	చిత్తూరు, గుడిపాల (చిత్తూరు జిల్లా)	శ్రీపెరంబూదూర్ (తమిళనాడు)

వేమన పద్యాలు జీవన సత్యాలు

- రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందన్న మహాయోగి వేమన
- వేమన జయంతి సభలో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ
- పలమనేరులో ఘనంగా వేమన విగ్రహావిష్కరణ



యోగి వేమన విగ్రహావిష్కరణలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైవీఆర్ ట్రస్టు నిర్వాహకులు

పలమనేరు: వేమన పద్యాలు జీవనసత్యాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అధ్యక్షుడు చెంగారెడ్డి అధ్యక్షతన స్థానిక మార్కెట్ కమిటీ వద్ద యోగి వేమన విగ్రహావిష్కరణ, వేమన 372వ జయంతి కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. తొలుత వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ నీతివంతమైన సమాజ స్థాపన కోసం అప్పట్లోనే ఆయన చేసిన సంస్కరణలు ఇప్పటికీ ఆచరిస్తున్నామని తెలిపారు. అంతటి మహనీయుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య మానవుడిని సైతం ఆలోచింపజేసే ఆయన పద్యాలు అక్షరాల సత్యాలన్నారు. రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందని వేమన చెప్పిన మాట నిజమేనని, నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పాలనను చూస్తుంటే ఇది అర్థమవుతుందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వర్షాలు బాగా కురిసి ప్రజలు సంతోషంతో ఉన్నారని చెప్పారు.

కల నిజం చేసిన సీఎం జగన్

యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆయా ప్రభుత్వాలను కోరగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలను నిజం చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మాట్లాడుతూ నాటి సమాజంలో దాగున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను కడిగిపారేసిన యోగి వేమన అని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు వేమారెడ్డి ట్రస్టు అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, పెద్దపంజాణి ఎంపీపీ రెడ్డెప్ప, కొండారెడ్డి, కన్వీనర్లు జాఫర్, బాలాజీనాయుడు, బాగారెడ్డి, మోహన్‌రెడ్డి, కేశవులు, విశ్వనాథ రెడ్డి, స్థానిక వైవీఆర్ ట్రస్టు ఉపాధ్యక్షుడు బాలాజీరెడ్డి, కార్యదర్శి అమరనాథ రెడ్డి, కోశాధికారి జయప్రకాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు, సభ్యులు నియోజకవర్గంలోని రెడ్డి కులస్తులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక శాఖా గ్రంథాలయంలోనూ నిర్వహించారు. నూతనంగా ఆవిష్కరించిన వేమన విగ్రహానికి పట్టణానికి చెందిన బాస్ సంస్థ నాయకులు నరేష్ తదితరులు కూడా పూలమాల వేసి నివాళులర్పించారు.

నయవంచకుడు చంద్రబాబు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజలను నమ్మించి దగా చేసే నయవంచకుడు చంద్రబాబునాయుడు అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ధ్వజమెత్తారు. పెనుమూరు మండలం కత్తిరెడ్డిపల్లెలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. వెన్నుపోటుకు కేరాఫ్‌గా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవాచేశారు. నెల్లూరు జిల్లాలో తన పబ్లిసిటీ కోసం ఎనిమిదిమంది అమాయక ప్రజలను పొట్టనపెట్టుకుని, పోలీసుల అజాగ్రత్త వల్లే ప్రజలు ప్రాణాలను పోగొట్టుకున్నారని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. నిరంతరం చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడమే ధ్యే యంగా ఎల్లో మీడియా పనిచేస్తోందని.. వీటికి తోడు కాపు కులస్తులను చంద్రబాబుకు తాకట్టుపెట్టిన ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అని ఆరోపించారు. బీజేపీకి, టీడీపీకి దూరంగా ఉంటా నన్న పవన్ చంద్రబాబును కలవడం దేనికి సంకేత మని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు, పవన్‌కల్యాణ్‌కు రాజకీయ సన్యాసం తప్పదని అన్నారు. అంతకు ముందు చింతపెంట సచివాలయ పరిధిలో ప్రజా ప్రతినిధులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ట్రాన్స్‌కో అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల టారీఫ్‌పై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని ఈఈ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వినియోగదారులకు అభిప్రాయాలను తెలియజేసే అవకాశం కల్పించారు. చిత్తూరు ట్రాన్స్‌కో రూరల్ ఈఈ కార్యాలయంలో అధికారులు సమావేశానికి హాజరయ్యారు. విజయవాడ నుంచి ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి, సీఎండీలు మాట్లాడారు. 2000-20001లో 26.84 శాతం విద్యుత్ పంపిణీలో నష్టాలు ఉండేవని, ప్రస్తుతం వాటిని 8.23 శాతానికి తగ్గించామని తెలిపారు. నవరత్నాల పథకంలో భాగంగా వ్యవసాయ, ఆక్వా రైతులు, ఇతర బడుగు, బలహీనవర్గాల వినియోగదారులకు సబ్సిడీ రూపంలో విద్యుత్ సరఫరా ఇస్తున్నామన్నారు. నిర్వాహణ, పెరిగిన బొగ్గు భారం, జీతభత్యాలు, పరికరాల ఖరీదు తదితర అంశాలతో పెంపు అనివార్యమని తెలిపారు.

ఉగాది నాటికి 24 వేల గృహ ప్రవేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో రానున్న ఉగాది నాటికి జిల్లా వ్యాప్తంగా 24 వేల ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి జిల్లాలోని చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు, పుంగనూరు అర్బన్ ప్రాంతాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై డీఈలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఉగాది నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్ల గృహ ప్రవేశాలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో మన జిల్లాలో 24వేల గృహ ప్రవేశాలు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించారని తెలిపారు. ఈ లక్ష సాధనకు గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రధానంగా అర్బన్ లేఔట్‌లో ఇసుక, సిమెంటు, కమ్మీలను నిర్మాణాలు చేపడుతున్న వారందరూ కలిసి తీసుకోవడం వల్ల ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. మెప్మా అధికారులు రుణ సదుపాయాన్ని లబ్ధిదారులకు అందించాలన్నారు. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు మేస్త్రీలు, కూలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలి

జిల్లాలో ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. జిల్లాలో డ్వామా ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుంచి మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్నారు. రెండున్నర నెలల్లో పూర్తిస్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. ఫిబ్రవరి 6వ తేదీ నాటికి రోజుకు లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా పనులను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు.

కాలువలో పసికందు మృతదేహం



పుంగనూరు: పట్టణంలోని చౌడేపల్లె రోడ్డు కొండిన్యనది కాలువ వద్ద గురువారం పసికందు మృతదేహాన్ని పట్టణవాసులు కనుగొన్నారు. మృతదేహాన్ని కొందరు ఖననం చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో విచారణ ప్రారంభించారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

నువ్వా-నేనా





వెదురుకుప్పం మండలం బాలుపల్లెలో గురువారం ఎడ్ల పందేలు దుమ్మురేపాయి. ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టి పందేనికి ఉసిగొల్పారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న యువకులు అల్లి వద్ద పలకల కోసం పందేలకు సిద్ధమయ్యారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనాలపై దూసుకు వచ్చాయి. ఎడ్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువకులు నువ్వా-నేనా అన్నట్లు పోటీ పడ్డారు. కొందరు ఎడ్ల వేగాన్ని కట్టడి చేసి పలకలను లాక్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామంలో సందడి నెలకొంది.

- వెదురుకుప్పం

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

- గ్రామాలకు చేరిన అధునాతన సాఫ్ట్‌వేర్, పరికరాలు.
- సమీక్షలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 63 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు డాక్యుమెంటేషన్ మ్యాప్, ఇతర కార్యక్రమాలు పూర్తి అయిన 63 గ్రామాలు, పైలెట్ ప్రాజెక్టులో ఉన్న రెండు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆన్‌లైన్ డేటాను, అధునాతన సాఫ్ట్‌వేర్, ఇతర పరికరాలను అందించినట్లు తెలిపారు. ప్రజలు సుదూర ప్రాంతాలలో ఉన్న రిజిస్టార్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సంబంధిత పత్రాలను గ్రామ సచివాలయాలకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. భూములకు సంబంధించిన ఈసీ సంబంధిత సచివాలయాల్లోనే తీసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్టార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ ఇండియా వాలీబాల్ టోర్నమెంట్



వాలీబాల్ టోర్నీకి సిద్ధమైన కోర్టు, గ్యాలరీలు

బంగారుపాళెం: బంగారుపాళెంలో శుక్రవారం నుంచి సౌత్ ఇండియా ఇన్విటేషన్ పురుషులు, మహిళల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెన్నై బ్లిట్జ్ టెక్నికల్ అధికారి తులసిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా తెలిపారు. గురువారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చెన్నై బ్లిట్జ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి మొత్తం 8 జట్లు పాల్గొంటాయని చెప్పారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. 22వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాల్గొననున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వాలీబాల్ కోచ్ సుదర్శన్ నాయుడు, వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు కృష్ణమూర్తి, మురారి, కామరాజు పాల్గొన్నారు.

ఆధార్ సేవలపై విస్తృత అవగాహన



చిత్తూరు సచివాలయంలో ఆధార్ శిబిరంలో సేవలు పొందుతున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవలపై క్షేత్రస్థాయి అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 92 సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవల్లో గురువారం 775 మంది సేవలు వినియోగించుకున్నట్లు తెలిపారు.

23 బస్తాల గుట్కా స్వాధీనం



నిందితులు సంపూర్ణం, రాజా, రవి, కృష్ణమూర్తి

- నలుగురి అరెస్టు
- నిందితులు చిత్తూరు జిల్లా పలమనేరు వాసులు

తిరువళ్లూరు: చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి చెన్నైకు గుట్కా తరలిస్తున్న నలుగురిని నసరత్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నసరత్‌పేటలో సబ్‌ఇన్‌స్పెక్టర్ జమున గురువారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన ఏపీ39యూ4581 వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 23 బస్తాల గుట్కాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు చిత్తూరు జిల్లా పలమనేరు జండామఠం ప్రాంతానికి చెందిన నరసింహులు కుమారుడు రవి(25) పలమనేరు రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మహేంద్ర భార్య సంపూర్ణం(42), ఈమె కుమారుడు రాజ(23), అంబత్తూరుకు చెందిన మారిస్వామి కుమారుడు కృష్ణమూర్తి (36) అని గుర్తించారు.

టీటీడీలో పకడ్బందీగా విద్యుత్ ఆదా



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: టీటీడీలో విద్యుత్‌ను ఆదా చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల కార్యాలయంలో ఏపీ ఎస్ఈసీఎం(ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్), నెడ్‌క్యాప్(నాన్‌కన్వెన్షనల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ) సంస్థల అధికారులతో గురువారం ఈవో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ విద్యుత్ ఆదా చర్యల్లో భాగంగా అన్ని విభాగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా టీటీడీలోని తాగునీటి పంపింగ్ స్టేషన్లలో 100 పాత పంపు సెట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నెడ్‌క్యాప్ సంస్థ ఆధ్వర్యంలో టీటీడీలో అన్నప్రసాదాల తయారీకి సోలార్ స్టీమ్ కుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఈ విధానం ద్వారా వంటగ్యాస్ ఆదా అవుతుందన్నారు. ఈమేరకు సదరు సంస్థల అధికారులతో టీటీడీ ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఏపీ ఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి, నెడ్‌క్యాప్ జనరల్ మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డి, ఏరియా మేనేజర్ ఆంజినేయులురెడ్డి, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, డీఈ రవిశంకర్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ హత్య కేసు విచారణకు ప్రత్యేక పీపీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో 2015లో మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా శైలజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడిగా చింటూతో పాటు మరో 20 మంది నిందితులుగా ఉన్నారు. గత ఏడాది కేసు విచారణ షెడ్యూల్ నిర్ణయిస్తూ చిత్తూరులోని 6వ అదనపు జిల్లా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న నిర్మల కేసు నుంచి తప్పుకున్నారు. మరో పీపీని నియమించాలని న్యాయమూర్తి శాంతి డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు లేఖ రాయగా, ప్రభుత్వం ప్రత్యేక పీపీగా శైలజను నియమించింది. ఇప్పటికే ఈమె చిత్తూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో పీపీగా పనిచేస్తున్నారు.

సంక్రాంతి వేడుకలకు వెళ్లి వస్తూ..



మృతి చెందిన మధుబాబు(ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని మేలుపట్ల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన హరినాథ్ కుమారుడు మధుబాబు(23) మృతి చెందాడు. పోలీసుల కథనం.. మేలుపట్లకు చెందిన శ్రీహరి, మధు బాబు ద్విచక్ర వాహనాలపై గురువారం మండలంలోని గొల్లపల్లెకు సంక్రాంతి వేడుకలకు వెళ్లారు. వేడుకల అనంతరం ఇద్దరూ ద్విచక్ర వాహనాల్లో గ్రామానికి వస్తున్నారు. మేలుపట్ల వద్దకు రాగానే ముందు వెళ్తున్న రెడ్డెప్ప వాహనాన్ని శ్రీహరి వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు కింద పడ్డాయి. ఈఘటనలో శ్రీహరి స్వల్పంగా గాయ పడగా, మధుబాబు తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు.

బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో తేలుతున్న మృతదేహం

పాలసముద్రం : మండలంలోని తొట్టికండ్రిగ పంచాయతీ సాయినగర్ గ్రామ సమీప పొలాల్లోని బావిలో వ్యక్తి మృతి చెంది ఉండగా గురువారం స్థానికులు గుర్తించారు. మృతుడు అదే గ్రామానికి చెందిన ఎం.ఉమాపతిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం.. సాయినగర్ గ్రామానికి చెందిన పెద్దబ్బ కుమారుడు ఎం.ఉమాపతి(33), భార్య మూడు రోజుల కిందట గొడవపడ్డారు. భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఉమా పతి రెండు రోజులుగా మద్యం తాగుతున్నాడు. మద్యం మత్తులో గ్రామ సమీపంలోని రోడ్డు పక్కనున్న పొలాల్లోని బావిలో పోయాడు. మృత దేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టమ్ నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణ పరిధి మరాఠిగేటు సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి కథనం మేరకు... మరాఠిగేటు, నందిమంగళం గ్రామాల మధ్య సుమారు 27 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నల్లరంగు జీన్స్ ప్యాంటు, నల్లరంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు. కాళ్లకు షూస్ ధరించి ఉన్నాడు. తల, మొండెం వేరు కావడంతో ఆత్మహత్యగా రేల్వే పోలీసులు పరిగణిస్తున్నారు. ఈ విషయం రాత్రి 7 గంటల సమయంలో గుర్తించి, మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్లేట్‌లెట్‌లు పడిపోవడంతోనే పసికందు మృతి

చిత్తూరు రూరల్: ప్లేట్‌లెట్లు పడిపోవడంతో 6రోజుల పసికందు మృతి చెందిందని వైద్యాధికారులు నిర్ధారించారు. గత నెల 14న చిత్తూరు నగరం సంతపేటకు చెందిన భవ్యశ్రీ ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించిన విషయం తెలిసిందే. బిడ్డ పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ బిడ్డ ఆరో రోజు మృతి చెందింది. దీనిపై కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు నలుగురు వైద్యాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఈ విచారణలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అన్నిరకాల వైద్య సేవలను పక్కాగా అందించినట్లు తేలింది. అలాగే రుయాలోని డాక్టర్లు కూడా తమవంతు ప్రయత్నం చేశారని గుర్తించారు. బిడ్డ చనిపోవడానికి ప్లేట్‌లెట్ కణాలు తగ్గిపోవడమే బలమైన కారణంగా విచారణలో తేలింది. రెండుసార్లు ప్లేట్‌లెట్ కణాలు ఎక్కించినా ఫలితం కనిపించలేదని, దీనికి తోడు ఊపిరితిత్తు సమస్య కూడా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కారణాలతో ఆ పసికందుకు ముక్కు, నోట్లో నుంచి రక్తం రావడం సమస్యగా మారి ఆరో రోజు చనిపోయిందని అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుచానూరు: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకోసం విశ్వవిద్యాలయం అధికారులు దరఖాస్తులు కోరుతున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాల కోసం www.spmvv.ac.in చూడాలని సీఈవో కళారాణి ఒక ప్రకటనలో తెలిపారు.